వెటర్నరీ డాక్టర్ల ఇష్టారాజ్యం

- పశు వైద్యాన్ని గాలికొదిలేసి.. సొంత వ్యాపారాలు
- పై అధికారులను మేనేజ్ చేస్తూ విధులకు డుమ్మా
- సకాలంలో వైద్యం అందక పశువులు మృత్యువాత
- ప్రైవేటు డాక్టర్లను ఆశ్రయిస్తున్న రైతులు
- డాక్టర్ల పనితీరుపై కొరవడిన నియంత్రణ
- మంత్రి లేకపోవడం శాఖకు మరో మైనస్

హైదరాబాద్, జనవరి 16 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో వెటర్నరీ డాక్టర్ల తీరు ఆడిందే ఆట.. పాడిందే పాటగా మారింది. దవాఖానలకు రాకుండా.. సొంత వ్యాపారాల్లో మునిగి తేలుతూ.. పశువుల వైద్యాన్ని గాలికొదిలేసి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో పశువులకు సకాలంలో వైద్యం అందక మృత్యువాత పడుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. తమ పశువుల ప్రాణాలను కాపాడుకొనేందుకు రైతులు గత్యంతరం లేని పరిస్థితుల్లో ప్రైవేటు వైద్యులను ఆశ్రయిస్తున్నారు. దీంతోపాటు క్షేత్రస్థాయిలో ఉండే పశుసంవర్ధక శాఖకు సంబంధించిన గోపాలమిత్రలు కూడా ప్రైవేటు డాక్టర్ల బాటలోనే నడుస్తున్నట్టు తెలిసింది. వెటర్నరీ డాక్టర్ల అజమాయిషీ కొరవడటంతో గోపాలమిత్రలు పశువులకు వైద్యం చేస్తూ రైతుల నుంచి వసూళ్లకు పాల్పడుతున్నట్టు ఆరోపణలున్నాయి. ఒకవేళ డబ్బులు ఇవ్వకపోతే పశువులకు వైద్యం చేసేందుకు నిరాకరిస్తున్నారనే విమర్శలున్నాయి. ఈ విధంగా వెటర్నరీ డాక్టర్లు, గోపాలమిత్రల నిర్లక్ష్యంతో పశువులు బలికావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఏడాదికాలంగా ఈ శాఖకు ప్రత్యేకంగా మంత్రి లేకపోవడం మరో శాపంగా మారింది. పశు సంవర్ధక శాఖ కూడా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్దనే ఉన్నది. పూర్తి కాలం వెచ్చించే మంత్రి లేకపోవడంతో శాఖపై పర్యవేక్షణ, అజమాయిషీ కరువైందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

దవాఖానకు వచ్చేది లేదు.. పశువుకు సూది ఇచ్చేది లేదు

సీనియర్ వెటర్నరీ డాక్టర్లు నెలకు రూ.లక్ష నుంచి రూ.1.5 లక్షల వరకు వేతనం అందుకుంటున్నారు. రాష్ట్రంలోని వెటర్నరీ డాక్టర్లలో 50-60% మంది సరిగ్గా విధులకు హాజరుకాకుండా, నెలల తరబడి డుమ్మా కొడుతున్నారనే ఆరోపణలున్నాయి. కొందరు రియల్‌ఎస్టేట్ వ్యాపారంలో, మరికొందరు ఇతర బిజినెస్‌ల్లో మునిగితేలుతున్నారనే విమర్శలున్నాయి. ఈ తంతు ముఖ్యంగా నల్లగొండ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట, మెదక్, ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో అత్యధికంగా ఉన్నట్టు తెలిసింది. మెదక్ ప్రాంతానికి చెందిన ఒక వెటర్నరీ డాక్టర్ దవాఖానకు రాకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నట్టు తెలిసింది. భువనగిరి జిల్లాలో ఓ 'కిరణం', రంగారెడ్డి జిల్లాలో ఓ 'రామా' దవాఖానలకు రాకుండా సొంత వ్యాపారాలు చేస్తున్నట్టు తెలిసింది. మల్లేపల్లి, దేవరకొండ మండలాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొన్నది.

జిల్లా అధికారుల అండదండలు

వెటర్నరీ డాక్టర్ల ఆగడాలకు జిల్లా వెటర్నరీ అధికారుల అండదండలు ఉన్నట్టు చర్చ జరుగుతున్నది. విధులకు డుమ్మా కొడుతున్న డాక్టర్లు.. జిల్లా అధికారులకు ప్రతి నెలా ఇంత అని ముట్టజెప్పుతున్నట్టు ఆరోపణలున్నాయి. దీంతో అధికారులు కూడా చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారని, విధులకు రాకపోయినా హాజరు వేస్తున్నారని సమాచారం. దీంతో డుమ్మా కొడుతున్న డాక్టర్లకు ప్రతి నెలా తంచనుగా జీతం అందుతుండటం కొసమెరుపు. పశువులకు వేయాల్సిన వివిధ రకాల వ్యాక్సినేషన్ కార్యక్రమాలను కూడా సరిగ్గా నిర్వర్తించడం లేదని తెలిసింది. ఏదో తూతూ మంత్రంగా చేసేసి, రికార్డుల్లో దొంగ లెక్కలు నమోదు చేసి మిగిలిన వ్యాక్సిన్లను చెత్తపాలు చేస్తున్నట్టు ఆరోపణలున్నాయి.

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో యువత

- ట్రేడింగ్‌తో సులభంగా డబ్బు సంపాదించవచ్చంటూ పిల్లలను రొంపిలోకి దింపుతున్న తల్లిదండ్రులు
- ఆశతో కొందరు.. తెలియక మరికొందరు మోసపోతున్న వైనం

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 16 (నమస్తే తెలంగాణ): సైబర్ నేరగాళ్ల చేతిలో తెలంగాణ యువత పావులుగా మారుతున్నారు. సులభంగా డబ్బు సంపాదించవచ్చన్న అత్యాశతో కొందరు, తెలిసీ తెలియక మరికొందరు సైబర్ మోసాల ఉచ్చులో చిక్కుకుంటున్నారు. ఇటీవల ఓ కేసు దర్యాప్తులో హైదరాబాద్ సైబర్‌క్రైం పోలీసులకు కొన్ని బ్యాంకు ఖాతాలపై అనుమానం రావడంతో వాటిని ఎవరు ఎక్కడి నుంచి ఆపరేట్ చేస్తున్నారో ఆరా తీశారు. కోదాడలోని ఓ గ్రామంలో ఆ ఖాతాలు ఉన్నట్టు తెలియడంతో అక్కడికి వెళ్లారు. ఓ ఇంజినీరింగ్ విద్యార్థినితోపాటు అగ్రికల్చర్ బీటెక్ చేసిన మరో యువకుడి సంబంధించిన ఖాతాలతో సైబర్ నేరానికి లింక్ ఉన్నట్టు గుర్తించడంతో ఆ ఇద్దరిని అరెస్ట్ చేశారు. వారిని ప్రశ్నించడంతో అలాంటివారు ఆ చుట్టుపక్క గ్రామాల్లో చాలా మంది ఉన్నట్టు తేలడంతో పాటు విస్తుపోయే నిజాలు బయటకు వచ్చాయి. 'పలానా వాళ్లు ట్రేడింగ్‌లో భారీగా డబ్బులు సంపాదిస్తున్నారు. నెలకు రూ. లక్ష ఆర్జిస్తున్నారు. నువ్వు కూడా వెంటనే ఆ పని మొదలుపెట్టు' అంటూ కొందరు తల్లిదండ్రులే తమ పిల్లలపై ఒత్తిడి తెస్తున్నట్టు వెల్లడైంది.

బ్యాంకు ఖాతాలను కిరాయికిచ్చి..

ఇలాంటి అమాయకులను సైబర్ నేరగాళ్లు పావులుగా వాడుకొంటున్నారు. ట్రేడింగ్‌లో మంచి లాభాలను ఆర్జించవచ్చంటూ సోషల్ మీడియాలో ప్రకటనలు గుప్పించి వారిని ఆకర్షిస్తున్నారు. ఆపై ఆ నేరగాళ్ల ముఠాలోని సభ్యులే వాట్సాప్, టెలిగ్రామ్ యాప్‌లలో గ్రూపులను ఏర్పాటు చేసుకుని పలానా షేర్లలో తాము భారీగా లాభాలు పొందామని, పలానా షేర్లలో జాక్‌పాట్ తగిలిందని చాటింగ్ చేసుకుంటూ కొత్తవారిని రెచ్చగొడుతున్నారు. వారి వలలో చిక్కినవారికి కొన్ని యాప్‌లు, వెబ్‌సైట్ల లింకులు పంపి వాటిలోనే ట్రేడింగ్ చేయాలని సూచిస్తున్నారు. అలా మొదట్లో స్వల్పంగా, ఆ తర్వాత భారీగా లాభాలు వచ్చినట్టు స్క్రీన్లపై చూపిస్తున్నప్పటికీ ఆ సొమ్మును డ్రా చేసుకునేందుకు వీల్లేకుండా చేస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే.. కొత్త ఎత్తులు వేస్తున్నారు. టెక్నికల్ సమస్య వల్లే మీ సొమ్మును డ్రా చేసుకోలేకపోతున్నారని, ఆ సొమ్మును పొందాలంటే మీ బ్యాంకు ఖాతాలను కిరాయికి ఇవ్వాలని, ఆ ఖాతాల్లో డబ్బు డిపాజిట్ చేస్తామని, ఆ సొమ్మును యూఎస్‌డీ, యూఎస్‌డీటీ, క్రిప్టో కరెన్సీగా మార్చి తాము సూచించిన ఖాతాల్లోకి పంపాలని నమ్మబలుకుతున్నారు. దీంతో ఆ అమాయకులు తమ సొమ్మును రాబట్టుకునేందుకు బ్యాంకు ఖాతాలను కిరాయికి ఇవ్వడంతో కేటుగాళ్లు మరికొందరు ఇతరులను మోసగించడం ద్వారా వచ్చిన సొమ్మును ఆ ఖాతాల్లో డిపాజిట్ చేయిస్తున్నారు. ఆ ఖాతాదారులు ఆ సొమ్మును క్రిప్టో కరెన్సీగా మార్చి సైబర్ నేరగాళ్లు చెప్పిన ఖాతాల్లోకి పంపడం ద్వారా 5% కమిషన్ పొందుతున్నారు. అలా రోజూ వేలల్లో కమిషన్ వస్తున్న విషయం ఇతరులకు తెలియడటంతో వారు కూడా తమ ఖాతాలను కిరాయికి ఇస్తామంటూ మందుకొచ్చినట్టు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది.

నిందితులుగా మారడం ఖాయం

గుర్తుతెలియని వ్యక్తులకు బ్యాంకు ఖాతాలను కిరాయికి ఇవ్వడం నేరమని సైబర్‌క్రైం పోలీసులు హెచ్చరిస్తున్నారు. తెలియనివారి నుంచి మన ఖాతాలోకి డబ్బు వచ్చిందంటే అది నేరానికి సంబంధించినదే అయి ఉంటుందని గుర్తించాలని, లేకుంటే ఆ ఖాతాదారులు నిందితులుగా మారడం ఖాయమని స్పష్టం చేస్తున్నారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి సోషల్ మీడియాలో, ఆన్‌లైన్‌లో వచ్చే లింకులను ఓపెన్ చేసి నకిలీ యాప్‌లు, వెబ్‌సైట్ల ద్వారా ట్రేడింగ్ చేస్తే మోసపోక తప్పదని, ఎలాంటి ట్రేడింగ్‌నైనా అధికారిక వెబ్‌సైట్ల ద్వారానే చేయాలని సూచిస్తున్నారు.

మధిరలో 'భట్టి' దిష్టిబొమ్మ దహనం

- బీఆర్ఎస్ నాయకుడి బోర్డును తొలగించడంపై గ్రామస్తుల ఆగ్రహం

మధిర మండలం ఆత్కూరులో డిప్యూటీ సీఎం భట్టి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న గ్రామస్తులు

మధిర/ మధిర రూరల్, జనవరి 16: స్థానిక ఎమ్మెల్యేగా, డిప్యూటీ సీఎంగా ఉన్న భట్టి విక్రమార్క దిష్టిబొమ్మను అతడి నియోజకవర్గంలోని ప్రజలు దహనం చేయడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఎన్నో దశబ్దాలుగా ఇక్కడి ప్రజలకు సేవ చేస్తున్న బీఆర్ఎస్‌కు చెందిన ఓ కుటుంబంపై ఉప ముఖ్యమంత్రి ప్రోద్బలంతో కాంగ్రెస్ నాయకులు కక్షపూరితంగా వ్యవహరించడంతో డిప్యూటీ సీఎం దిష్టిబొమ్మను దహనం చేసిన ఘటన ఖమ్మం జిల్లా మధిరలో గురువారం చోటుచేసుకుంది. మధిర మండలం ఆత్కూరుకు చెందిన 'అబ్బూరి' కుటుంబంలోని సంధ్య గత పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. రెండేళ్ల క్రితం ఆమె భర్త రామకృష్ణ (మాజీ సర్పంచ్) అనారోగ్యంతో మరణించాడు. అందుకు గుర్తుగా 'అబ్బూరి సర్కిల్' అని నామకరణం చేసి, ఓ బోర్డు ఏర్పాటుచేశారు. గ్రామాభివృద్ధికి పాటుపడిన బీఆర్ఎస్ సర్పంచ్‌కు ప్రజల్లో మంచి పేరు రావడాన్ని కాంగ్రెస్ నాయకులు తాళలేకపోయారు. ఈ విషయాన్ని భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ప్రోద్బలంతో పోలీసు బందోబస్తు మధ్య 'అబ్బూరి సర్కిల్' నేమ్ బోర్డులను గురువారం తొలగించారు. దీంతో ఆగ్రహించిన గ్రామస్తులు భట్టి దిష్టిబొమ్మను దహనం చేశారు. 'భట్టి దౌర్జన్యం నశించాలి.. భట్టి డౌన్ డౌన్..' అంటూ నినాదాలు చేశారు. ఇది హేయమైన చర్య అని జడ్పీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ మధిర నియోజకవర్గ ఇన్‌చార్జి లింగాల కమల్‌రాజు విమర్శించారు. ప్రజాదరణ కలిగిన నేతల పేర్లు తుడిచి పైశాచిక ఆనందం పొందడం భట్టికి సరైంది కాదని హితవుచెప్పారు.

జిన్నింగ్ మిల్లులో అగ్నిప్రమాదం

- 2వేల క్వింటాళ్ల పత్తి దగ్ధం
- రూ. కోటికి పైగా నష్టం

కాటారం, జనవరి 16: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం మీనాక్షి కాటన్ జిన్నింగ్ మిల్లులో అగ్నిప్రమాదం జరిగింది. పోలీసులు, మిల్లు యజమానుల కథనం ప్రకారం.. మీనాక్షి జిన్నింగ్ మిల్లులో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రంతో పాటు మిల్లు ఆధ్వర్యంలో ప్రైవేటుగా పత్తి కొనుగోళ్లు జరుగుతున్నాయి. సీసీఐ ద్వారా కొనుగోలు చేసిన పత్తి ఓ వైపు, దానికి కొంచెం దూరంలో మిల్లర్లు కొనుగోలు చేసిన పత్తి కుప్ప మరోవైపు ఉన్నది. గురువారం ఒక్కసారిగా మిల్లర్లు కొన్న పత్తి కుప్పకు మంటలు అంటుకున్నాయి. మిల్లు నిర్వాహకులు కిషన్, కిశోర్ ఫైరింజిన్‌కు సమాచారమిచ్చి, మిల్లులో నీటిని పంపింగ్ చేసే పైప్‌లైన్ ద్వారా మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. కాటారం సీఐ నాగార్జున రావు, ఎస్సై అభినవ్ ఘటనాస్థలాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ప్రమాదంలో 2వేల క్వింటాళ్ల పత్తి దగ్ధమైనట్లు మిల్లు నిర్వాహకుడు కిషన్ తెలిపారు. రూ.కోటికి పైగా నష్టం వాటిల్లినట్లు పేర్కొన్నారు. మిల్లు ఆవరణలో సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తే ప్రమాద కారణాలు తెలిసే అవకాశం ఉంది. మిల్లు నిర్వాహకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

సముద్రస్నానానికి వెళ్లి ముగ్గురు మృతి

హైదరాబాద్,జనవరి 16 (నమస్తేతెలంగాణ) : ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. సముద్ర స్నానానికి వెళ్లిన ఐదుగురిలో ముగ్గురు మృతి చెందారు. మరో ఇద్దరు గల్లంతయ్యారు. సింగరాయకొండ పాకల బీచ్‌లో గురువారం ఐదుగురు సముద్రస్నానానికి వెళ్లారు. సముద్రంలో అలల తాకిడికి ఐదుగురూ గల్లంతయ్యారు. గల్లంతైన ఇద్దరిలో ఒకరిని జాలర్లు కాపాడగా.. మరో ముగ్గురు మృతి చెందారు. మరొకరి కోసం మెరైన్ పోలీసులు గాలింపు చర్యలు మొదలు పెట్టారు. మృతులు పొన్నలూరు మండలం తిమ్మపాలెంకు చెందిన వారిగా గుర్తించారు. మృతదేహాలను కందుకూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

కాంగ్రెస్ సర్కారుపై నేతన్నల పోరుబాట

- 20న కలెక్టరేట్ల ముట్టడి
- 25న భారీ బహిరంగ సమావేశం
- సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు పోరాటం కొనసాగింపు
- నేత కార్మికుల సంఘం స్పష్టీకరణ

హైదరాబాద్, జనవరి 16 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో చేనేత సమస్యలు పరిష్కారం కోసం నేత కార్మికులు కాంగ్రెస్ సర్కారుకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలకు శ్రీకారం చట్టారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పేరుకుపోయిన సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు పోరాటం కొనసాగిస్తామని నేత కార్మిక సంఘాల నాయకులు కూరపాటి రమేశ్, వీ శాంతికుమార్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఈ నెల 20న జిల్లా కలెక్టరేట్ల ముట్టడించి, ధర్నా తదితర కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. దశలవారీగా జరగనున్న పోరాటంలో భాగంగా వచ్చే నెల 25న భారీ బహిరంగ సమావేశం నిర్వహించనున్నట్టు తెలిపారు.

చేనేత కార్మికుల డిమాండ్లు

- చేనేత వస్త్ర పరిశ్రమ కార్మికుల కోసం ఉపాధి, సంక్షేమ, అభివృద్ధి బోర్డు ఏర్పాటు చేయాలి.
- అభివృద్ధి బోర్డులకు రూ.1,000 కోట్ల బడ్జెట్ కేటాయించాలి.
- ప్రతి కార్మికుడికి రూ.5 లక్షల పెట్టుబడి సాయం అందించాలి.
- కాంగ్రెస్ సర్కారు నిలిపివేసిన త్రిఫ్ట్ ఫండ్ పథకాన్ని తిరిగి కొనసాగించాలి.
- ఆరోగ్య బీమా పథకాన్ని అమలు చేయాలి.
- చేనేత కార్మికుల రుణాలు మాఫీ చేయాలి.
- చేనేత సహకార సంఘాలు, టెస్కోకు ఎన్నికలు నిర్వహించాలి.
- నూలు రంగుల సబ్సిడీ పథకం నగదు బదిలీ కొనసాగించాలి.
- ఇల్లులేని చేనేత కార్మికులకు హౌస్‌తో పాటు వర్క్‌షెడ్ పథకాన్ని పునరుద్ధరించాలి.
- టెస్కో ద్వారా చేనేత సహకార సంఘాల్లో నిల్వ ఉన్న వస్త్రాలను కొనుగోలు చేయాలి.
- అందుకోసం ప్రభుత్వం నిధులు విడుదల చేయాలి.

నిజామాబాద్ బల్దియా ఎదుట ధర్నా చేస్తున్న మెప్మా ఆర్పీలు

వేతనాలు చెల్లించాలని మెప్మా ఆర్పీల ధర్నా

కంఠేశ్వర్, జనవరి 16: వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎదుట మెప్మా ఆర్పీలు ధర్నాకు దిగారు. ఆర్నెల్ల వేతనాలు విడుదల కాగా, ఐదు నెలలవి చెల్లించి, ఇంకో నెల వేతనం నిలిపి వేయడాన్ని నిరసిస్తూ ఆందోళన చేపట్టారు. ఇప్పటిదాకా అన్ని సర్వేల్లో పాల్గొన్నామని, అనారోగ్య కారణాలతో కొంత మంది గైర్హాజరైతే వేతనాలు ఆపడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. దీనిపై మెప్మా పీడీ రాజేందర్‌ను వివరణ కోరగా.. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం నడుచుకుంటున్నామని, సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొనని వారిని సంజాయిషీ ఇవ్వాలని కోరామని చెప్పారు.

గ్రామస్తులతో మాట్లాడుతున్న తహసీల్దార్ ఎజాజ్ ఖాన్

రేషన్‌కార్డు సర్వే అడ్డగింత

- జాబితాలో తమ పేర్లు లేవని గ్రామస్తుల నిరసన
- వెరిఫికేషన్ ప్రక్రియను బహిష్కరించిన తండావాసులు

కుంటాల, జనవరి 16 : నిర్మల్ జిల్లా కుంటాల మండలం దౌనెల్లిలో గురువారం రేషన్ కార్డు సర్వే చేస్తున్న ప్రభుత్వ సిబ్బందిని గ్రామస్తులు అడ్డుకున్నారు. దౌనెల్లి గ్రామ పంచాయతీలో దౌనెల్లి తండా, మహాదేవ తండా అనుబంధ గ్రామాలుగా ఉన్నాయి. ఈ తండాల్లో 1200కు పైగా జనాభా ఉండగా.. 100 మంది రేషన్‌కార్డుల కోసం అర్జీలు సమర్పించారు. దౌనెల్లికి 20, దౌనెల్లి తండాకు 22, గమ్మపూర్ తండాకు 5, మహదేవ్ తండాకు నాలుగు కార్డులు మంజూరయ్యాయి. గురువారం రెవెన్యూ అధికారులు షార్ట్ లిస్టు అయిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారణ చేయడానికి వెళ్లారు. 51 మంది లబ్ధిదారుల పేర్లు మాత్రమే వెరిఫికేషన్ లిస్ట్‌లో ఉండడంతో గ్రామస్తులు అధికారులను నిలదీసి, వెరిఫికేషన్ ప్రక్రియను అడ్డుకున్నారు. అర్హులందరికీ కార్డులివ్వకుండా కొందరికే ఎలా ఇస్తారని మండిపడ్డారు. తహసీల్దార్ ఎజాజ్‌ఖాన్ వచ్చి గ్రామస్తులతో మాట్లాడగా వారు అర్జీని సమర్పించారు.

అఫీషియల్ లిక్విడేటర్ కార్యాలయం
1వ అంతస్తు, "కార్పొరేట్ భవన్", బండ్లగూడ, నాగోల్, హైదరాబాద్-500068.
ఫోన్ నం.లు 040-29803086/3186. ఇ-మెయిల్ : ol.hyderabad@mca.gov.in
ఫారం నెం.63
(రూల్ 148(1) మాడండి)
గౌరవనీయ ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానంలో: అమరావతి వద్ద (ప్రారంభ అధికారపరిధి)
కంపెనీల చట్టం, 1956 విషయంలో
మరియు
పయనీర్ అల్లాయ్ కాస్టింగ్స్ లిమిటెడ్ (లిక్విడేషన్‌లో కలదు) విషయంలో
C.P. నం. 171/2011
తమ క్లెయింను నిరూపించుటకు క్రెడిటార్లకు (కార్మికులతో సహా)
నోటీస్ ప్రకటన
పైన తెలిపిన కంపెనీ (లిక్విడేషన్‌లో కలదు) యొక్క క్రెడిటార్లకు (కార్మికులతో సహా) తెలియజేయునదేమనగా కంపెనీల చట్టం, 1956 సెక్షన్ 530 క్రింద ప్రాధాన్యం ఇచ్చుటకు వారి సంబంధిత పేర్లు, చిరునామాలు మరియు డెట్ లేదా క్లెయిం మరియు ఏదేని టైటిల్ వివరాలతో నిర్ణీత ఫారంలో సదరు డెట్ లేదా క్లెయింను నిరూపించు అఫిడవిట్‌తో, 17 ఫిబ్రవరి 2025న లేదా ఆలోగా అఫీషియల్ లిక్విడేటర్ కార్యాలయం, 1వ అంతస్తు, "కార్పొరేట్ భవన్", బండ్లగూడ, నాగోల్, హైదరాబాద్-500068 వద్ద బట్వాడా లేదా సదరు తేదీలోగా అతనికి చేరువిధంగా అఫీషియల్ లిక్విడేటర్‌కు పోస్ట్ ద్వారా పంపించి పైన తెలిపిన కంపెనీపై వారి సంబంధిత డెట్స్ లేదా క్లెయింలను రుజువులను తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం యొక్క అఫీషియల్ లిక్విడేటర్‌కు దాఖలు చేయవలసిందిగా వారికి తెలియజేయడమైనది. ఎవరేని క్రెడిటార్ పైన తెలిపిన విధంగా పరిమిత కాల వ్యవధిలోగా అతని/ఆమె/వారి అఫిడవిట్ రుజువును దాఖలు చేయుటలో విఫలమైతే అతని/ఆమె/వారి డెట్ రుజువు ముందు లేదా సందర్భాన్ని బట్టి సదరు పంపిణీ నుండి డివిడెండ్ పంపిణీ ప్రయోజనం నుండి మినహాయించబడును.
అఫీషియల్ లిక్విడేటర్ నుండి వ్రాతపూర్వకంగా నోటీస్ ద్వారా అతని/ఆమె/వారి రుజువును పంపిన ఎవరేని క్రెడిటార్ (కార్మికులతో సహా) స్వయంగా లేదా అతని/ఆమె/వారి అడ్వకేట్ ద్వారా సదరు నోటీస్‌లో తెలిపిన సదరు సమయం మరియు ప్రదేశం వద్ద సదరు డెట్ లేదా క్లెయిం విచారణకు హాజరు కావలెను మరియు అతని/ఆమె/వారి డెట్ లేదా క్లెయింకు అవసరమైన తదుపరి సాక్ష్యాలను దాఖలు చేయవలెను.
తేది: 13 జనవరి 2025
సం/-
(U.K.సాహూ, ICLS)
అఫీషియల్ లిక్విడేటర్,
తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం,
హైదరాబాద్
గమనిక: నోటరీ చేయబడిన రూ.20/- నాన్-జుడీషియల్ స్టాంప్ పేపర్‌పై కంపెనీల (కోర్ట్) రూల్స్, 1959 లోని రూల్ 151, 152 మరియు ఇతర వర్తించు రూల్స్ క్రింద మద్దతునిచ్చే డాక్యుమెంట్లతో సహా సందర్భాన్ని బట్టి ఫారం నెం.66 లేదా ఫారం నెం.67లో క్లెయింను దాఖలు చేయవలెను.

మూడు యూనివర్సిటీల పీహెచ్‌డీ కోర్సులపై యూజీసీ నిషేధం

న్యూఢిల్లీ, జనవరి 16: ప్రమాణాలకు అనుగుణంగా లేని పీహెచ్‌డీ డిగ్రీల కోర్సులను నిర్వహిస్తున్న రాజస్థాన్‌లోని మూడు విశ్వవిద్యాలయాలపై యూజీసీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆయా యూనివర్సిటీల పీహెచ్‌డీ డిగ్రీల ప్రోగ్రాములపై అయిదేండ్లపాటు నిషేధం విధించింది. వచ్చే విద్యా సంవత్సరం నుంచే తమ ఉత్తర్వులు అమల్లోకి వస్తాయని తెలిపింది. చురులోని ఓపీజేఎస్, అల్వార్‌లోని సన్‌రైజ్, ఝున్‌ఝునూలోని సింఘానియా యూనివర్సిటీలు ఆఫర్ చేసే పీహెచ్‌డీ ప్రోగ్రామ్స్‌లో చేరొద్దని.. అవి చెల్లవని హెచ్చరించింది.

90 కోట్లు దాటనున్న ఇంటర్నెట్ యూజర్లు

న్యూఢిల్లీ: ఇంటర్నెట్ యూజర్ల సంఖ్య 2025లో 90 కోట్లు దాటే అవకాశం ఉందని 'ఇంటర్నెట్ ఇన్ ఇండియా రిపోర్ట్, 2024' అంచనా వేసింది. 2024లో ఇంటర్నెట్ వినియోగదారుల సంఖ్య 88.6 కోట్లకు పెరిగింది. డిజిటల్ కంటెంట్ కోసం ఇండిక్ భాషల వినియోగం వృద్ధి చెందడంతో ఇంటర్నెట్ యూజర్లు 90 కోట్లు దాటిపోయే అవకాశం ఉందని అంచనావేసింది. ఇంటర్నెట్ యూజర్లలో 55 శాతం గ్రామీణ ప్రాంతాలవారే. వీరి సంఖ్య 48.8 కోట్లు.

కుంభమేళాపై స్టీవ్‌జాబ్స్ లేఖకు రికార్డు ధర

న్యూఢిల్లీ: 'యాపిల్' సహ వ్యవస్థాపకుడు స్టీవ్ జాబ్స్ పందొమ్మిదేళ్ల వయసులో కుంభమేళాపై రాసిన లేఖ వేలంలో రూ.4.32 కోట్లు పలికింది. భారతలో ఏప్రిల్‌లో ప్రారంభమయ్యే కుంభ మేళాకు తాను వెళ్లాలనుకుంటున్నానని దీనిలో రాశారు. 'శాంతి స్టీవ్ జాబ్స్' అని సంతకం చేశారు. స్టీవ్ అప్పట్లో ఉత్తరాఖండ్‌లోని నీమ్ కరోలీబాబా ఆశ్రమంలో ఏడు నెలలు గడిపారు. ఇంటికి వెళ్లిన తర్వాత, 'నేను గుండు చేయించుకున్నాను. భారతీయ కాటన్ వస్త్రాలను ధరించాను. చర్మం చాకొలెట్ బ్రౌన్-రెడ్ రంగులోకి మారింది' అని రాశారు. జాబ్స్ మరణించినప్పటికీ, ఆయన సతీమణి లారెన్ మహా కుంభ మేళాకు హాజరయ్యారు. ఆమె పేరును 'కమల'గా మార్చుకున్నారు. స్వామి కైలాసానంద గిరి వద్ద ఆధ్యాత్మిక సాధన చేస్తున్నారు.